సాక్షి
వికారాబాద్
సోమవారం । 14 । జూలై । 2025



బోనమెత్తిన పల్లెలు

ఆషాఢమాసం సందర్భంగా గ్రామాల్లో పోచమ్మ, మైసమ్మ తల్లులకు మహిళలు బోనమెత్తారు. 8లో▸



భళా.. చేనేత హస్త కళ

పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో చేనేత హస్త కళ ప్రదర్శన విక్రయాలు ప్రారంభమయ్యాయి. 8లో▸



ఫార్మర్ రిజిస్ట్రీకి..

ఫార్మర్ రిజిస్ట్రీకి మండల వ్యవసాయాధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. 9లో▸

నీలినీడలు

చేపపిల్లల పంపిణీ ఉన్నట్టా.. లేనట్టా?

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం గత ప్రభుత్వం ఉచిత చేప పిల్లల పంపిణీ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ పథకం అమలుపై ప్రస్తుతం నీలినీడలు కమ్ముకుంటున్నాయి. వర్షాకాలానికి ముందే టెండర్లు ఆహ్వానించే రాష్ట్రాధికారులు నేటికీ ఈ ప్రక్రియపై నోరు మెదపడం లేదు.

- గతేడాది పంపిణీ చేయని ప్రభుత్వం
- నేటికీ టెండర్లు ఆహ్వానించని సర్కార్
- సకాలంలో పంపిణీ చేయకుంటే చేపలు ఎదగక నష్టం
- ఆందోళనలో మత్స్యకారులు



చేపపిల్లలు వదులుతున్న అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు (ఫైల్)

పరిగి: గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం అమలు అవుతుందా లేదా అని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పథకం కొనసాగించినా చేపపిల్లలను ఆలస్యంగా వదిలితే ఎదుగుదలపై ప్రభావం ఉంటుందని వాపోతున్నారు. ప్రతీ ఏటా జూన్‌లో ఈ ప్రక్రియకు టెండర్లు ఆహ్వానించే అధికారులు ఈ ఏడాది ఆ పథకం ఊసెత్తడం లేదు. 2017లో ఈ పథకం ప్రారంభించిన బీఆర్‌ఎస్ సర్కార్ 2023 వరకు ఏడు విడతల్లో చేపపిల్లలు పంపిణీ చేపట్టింది. ప్రభుత్వం మత్స్యశాఖ నిధులు కేటాయించకపోవడం, ఇప్పటి వరకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో మత్యకారులు దిగాలు చెందుతున్నారు. ఉన్నతాధికారుల సమావేశం పూర్తయితేనే పథకంపై స్పష్టత రానుంది.

1.29 కోట్ల చేప పిల్లలు అవసరం

మత్స్యకారుల ఉపాధి కోసం గత ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా నీటి వసతి ఉన్న చెరువుల్లో చేప పిల్లలను వదిలేందుకు జూలైలో ప్రణాళిక సిద్ధం చేసుకునేది. సరఫరాకు సంబంధించి టెండర్ల ప్రక్రి యపై, చేప పిల్లల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి నేటికి ఎలాంటి స్పష్టత రాలేదు. జిల్లా వ్యాప్తంగా 830 చెరువులు, కుంటలు ఉండగా.. 16 ప్రాజెక్టులు ఉన్నాయి. జిల్లాలో 133 మత్యకార సంఘాలున్నాయి. జిల్లాలోని చెరువులు, ప్రాజెక్టులకు కలిపి 1.29 కోట్ల చేపపిపల్లు అవసరం. 35 ఎంఎం నుంచి 45ఎంఎం 1.04 కోట్లు, 80ఎంఎం–100ఎంఎం చేప పిల్లలను 25లక్షల మొత్తం 1.29 కోట్ల చేప పిల్లలను జిల్లా వ్యాప్తంగా చెరువుల్లో వదలాల్సి ఉంటుంది.

గతేడాది తీవ్ర నష్టం

గతేడాది రాష్ట్ర ప్రభుత్వం చేప పిల్లల పంపిణీ ప్రక్రియను నిలిపివేసింది. ఇటీవల మంత్రి వర్గ సమావేశంలో మత్స్య సంపదకు నిధులు కేటాయించారు. కానీ చేప పిల్లలను పంపిణీ చేస్తారా ఇంకా ఏదైన పథకం ప్రారంభిస్తారా అనేది స్పష్టత రావాల్సి ఉంది. ప్రభుత్వం గత ఏడాది చేప పిల్లలను పంపిణీ చేస్తామని చెప్పి చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటులో ఇతర రాష్ట్రాల నుంచి చేప పిల్లలను తీసుకువచ్చి నష్టం చవిచూశామన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసేది లేనిది ముందుగా చెబితే ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుంటామని మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉచితంగా పంపిణీ చేయాలి



ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయాలి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది పంపిణీ చేయక తీవ్రంగా నష్టపోయాం. ఇప్పటికైనా సర్కారు కార్యాచరణ రూపొందించాలి. చాలా మంది మత్స్యకారుల కుటుంబాలు చెరువులపైనే ఆధారపడి జీవిస్తున్నాయి.

– గాదె రామయ్య, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు, ఇప్పాయిపల్లి

ఉపాధికి ఇబ్బంది



గతేడాది చేప పిల్లలను పంపిణీ చేయక తీవ్రంగా నష్టపోయాం. ప్రైవేటులో చేప పిల్లల కొనుగోలుకు లక్షల రూపాయలు వెచ్చించాల్సి వచ్చింది. ప్రభుత్వం చేప పిల్లను పంపిణీ చేయడంతో మత్సకార కుటుంబాలకు ఉపాధి దొరుకుతుంది. వెంటనే చేప పిల్లల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలి.

– రమేశ్, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు, దాదాపూర్

ఆదేశాలు రావాల్సి ఉంది

చేపపిల్లల పంపిణీపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ఒకటి రెండు రోజుల్లో పూర్తి సమాచారం తెలుస్తుంది. ఉన్నతాధికారుల సమావేశంలో చేప పిల్లల పంపిణీపై ఆదేశాలు అందుతాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందితే టెండర్ల ప్రక్రియను పూర్తి చేస్తాం. ఈ సారి చేప పిల్లల ప్రక్రియ ఉంటుందని సమాచారం.

– వెంకన్న, జిల్లా మత్స్యశాఖ అధికారి

పారదర్శకతకు పాతర!

- ఆదర్శ పాఠశాలలో హావర్ బేస్ టీచర్ల ఎంపికలో అవకతవకలు
- వార్షిక రెన్యూవల్ సాకుతో ఎనిమిది మంది తొలగింపు
- నేడు కొత్త హెచ్‌బీటీలకు పోస్టింగులు

బషీరాబాద్: బషీరాబాద్ ఆదర్శ పాఠశాలలో హవర్ బేస్ టీచర్లల(హెచ్‌బీటీ) ఎంపికలో అధికారులు పారదర్శకతకు పాతరేశారు. పాఠశాలలో పనిచేసే హెచ్‌బీటీలను వార్షిక రెన్యూవల్ చేస్తూ రీఎంగేజీ చేయాలి. కానీ పాఠశాల ప్రిన్సిపాల్ ఏళ్ల నుంచి పనిచేస్తున్న ఏడుగురిని తొలగించడం వివాదస్పదమైంది. దీంతో తమను రోడ్డున పడేశారంటూ బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేడు కొత్తవారికి ప్రొసీడింగ్స్

బషీరాబాద్ మోడల్ పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 400 మంది విద్యార్థులున్నారు. వీరికి విద్యాబోధన చేయడానికి 17మంది పీజీటీలు, టీజీటీలు పనిచేస్తున్నారు. వీరిలో ప్రిన్సిపాల్ అనీలతో పాటు ఏడుగురు పీజీటీలు, ఒక టీజీటీ రెగ్యులర్ ఉద్యోగులు పనిచేస్తుండగా, మరో ఆరుగురు టీజీటీ, ఇద్దరు పీజీటీలు హెచ్‌బీటీలుగా పనిచేస్తున్నారు. కాగా ప్రభుత్వం హెచ్‌బీటీలను ప్రతీ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభంలో రెన్యూవల్ చేస్తూ రీఎంగేజీ చేస్తుంది. కానీ బషీరాబాద్ మోడల్ స్కూల్‌లో లక్ష్మణ్, ఆసీఫ్ అలీ, కవిత, మాధురి, అంజుమ్‌ఫాతిమా, రాజేశ్వరి, అభిత్ పాషాను హెచ్‌బీటీలుగా రీఎంగేజీ చేయకుండా ప్రిన్సిపాల్ అనీల ఏకపక్షంగా తొలగించారని బాధిత టీచర్లు ఆరోపిస్తున్నారు. ప్రిన్సిపాల్ మొదటి నుంచి వీరిపై విముఖత చూపడంతో పాటు వెళ్లిపోయేల ఒత్తిడి పెంచడంతో కొందరు ప్రారంభంలోనే ప్రత్యామ్నాయం చూసుకొని వెళ్లిపోగా, మరికొందరు ఉద్యోగం కోల్పోయి రోడ్డున పడ్డారనే అపవాదు ఉంది. కాగా పాతవారి స్థానంలో నేడు కొత్తగా ఎంపికైన ఏడుగురు టీచర్లకు ప్రిన్సిపాల్ హెచ్‌బీటీ కింద ప్రొసీడింగ్స్ అందజేయనున్నారు.

కొత్తవారి ఎంపికలో అక్రమాలు!

తొలగించబడిన ఏడుగురు హెచ్‌బీటీల స్థానంలో కొత్త టీచర్ల ఎంపిక కోసం ప్రిన్సిపాల్ డెమో క్లాసులు నిర్వహించారు. డెమోకు అభ్యర్థులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. తెలుగు కోసం సుమారు 35 మంది దరఖాస్తు చేసుకోగా, మిగిలిన సబ్జెక్టులకు ఐదుమందికి పైగా అర్జీలు పెట్టుకున్నారు. ప్రిన్సిపాల్ నిబంధనలు తుంగలో తొక్కి రాజకీయ నాయకులు, ప్రభుత్వ టీచర్లు రెఫర్ చేసిన వారిని తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంత మందిని ఎంపిక చేసేందుకు డబ్బులు చేతులు మారినట్లు చర్చించుకుంటున్నఆరు. విచారణ జరిపితే అక్రమాలు బయట పడతాయని తెలుగు సబ్జెక్టు అభ్యర్థి ఒకరు తెలిపారు.

నిబంధనల ప్రకారమే..



ప్రభుత్వ నిబంధన ప్రకారం ప్రతీ ఏడాది హెచ్‌బీటీలను రెన్యూవల్ చేయాలి. ఇందకు పేపర్ ప్రకటన ఇచ్చాం. సబ్జెక్టుల వారీగా అభ్యర్థులకు డెమో క్లాసులు నిర్వహించి కొత్త టీజీటీలను ఎంపిక చేశాం. పాతవారు కొందరు స్వతంత్రంగా వెళ్లిపోయారు. కొందరు పనితీరు బాగోలేక తీసుకోలేదు. ఎలాంటి అక్రమాలకు తావులేదు.

– అనీల, ప్రిన్సిపాల్

వంద శాతం ఫలితాలు ఇచ్చాం



ఎనిమిదేళ్లుగా హెచ్‌బీటీగా పనిచేస్తూ మంచి ఫలితాలు తీసుకువచ్చేందుకు కృషి చేశా. గతేడాది పదవ తరగతి ఇంగ్లిష్‌లో వంద శాతం రిజల్ట్ వచ్చింది. నన్ను రీఎంగేజీ చేయాలని ఉన్నతాధికారులు ప్రొసీడింగ్ ఇచ్చినా తొలగించారు. ప్రిన్సిపాల్ ఏకపక్ష నిర్ణయంతో నా కుటుంబం రోడ్డున పడింది. ఉన్నతాధికారులే న్యాయం చేయాలి.

– అసీఫ్ అలీ, టీజీటీ, ఇంగ్లిష్

ఆరేళ్లుగా పనిచేస్తున్నా



తెలంగాణ ఉద్యమంలో జైలుకు వెళ్లాను. కష్టపడి చదివి టీజీటీ తెలుగు టీచరుగా మోడల్ స్కూల్‌లో ఆరేళ్లుగా పనిచేస్తున్నా. ప్రతీ ఏడాది సాధారణంగా రెన్యూవల్ చేసి రీఎంగేజీ చేశారు. ఈ ఏడాది నన్ను తొలగించి కొత్తవారిని తీసుకున్నారు. కారణం లేకుండా నన్ను తొలగించి నా కుటంబాన్ని రోడ్డు పాలుచేశారు. కలెక్టర్, ఎమ్మెల్యే న్యాయం చేయాలి.

– లక్ష్మణ్, టీజీటీ తెలుగు

ముగిసిన లాటరీ ప్రక్రియ



లాటరీలో వచ్చిన ప్లాటులో ఓ రైతు సంతోషం

ఫార్మా ప్లాట్లు పొందిన 4,174 మంది రైతులు

- 2,602 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తి
- కబ్జాలు చూపించిన అధికారులు
- ఫిర్యాదులతో పలువురి రిజిస్ట్రేషన్ల నిలిపివేత
- పాట్లు పొందినవారిలో ఆనందం

యాచారం: రైతులు ఎన్నాళ్లుగానో ఎదురుచూసిన ఫార్మా ప్లాట్ల లాటరీ ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. ఈ నెల 7 నుంచి 11 వ తేదీ వరకు ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేసి, మెగా వెంచర్‌లో కబ్జాలు చూపించారు. యాచారం, కందుకూరు మండలాల్లో ఫార్మా ప్లాట్లను 4,174 మంది రైతులకు అందజేశారు. కోల్పోయిన భూమిని బట్టి 60, 121, 181, 242, 302, 363, 423, 484, 544 గజాల చొప్పున ప్లాట్లను పంపిణీ చేశారు. మీరాఖాన్‌పేట టీజీఐఐసీ మెగా వెంచర్‌లో కలెక్టర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన లాటరీ ప్రక్రియలో 2,602 మంది రైతులు పాల్గొన్నారు. వారికి ప్లాట్ల నంబర్లు తీసి, వెంటనే రిజిస్ట్రేషన్లు చేసి కబ్జాలను చూపించారు. దీంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

లాటరీలో పాల్గొనని 1,572 మంది

లాటరీ ప్రక్రియలో పాల్గొనాలని అధికారులు ఆయా గ్రామాల్లో ఒక రోజు ముందే పంచాయతీల వద్ద లిస్టులను ప్రకటించారు. అయినా 1,572 మంది రైతులు లాటరీ ప్రక్రియలో పాల్గొనలేదు. వీరిలో 700 మంది వరకు అథారిటీలో పరిహారం డబ్బులు జమ చేసిన రైతులు ఉన్నారు. అథారిటీలో పరిహారం డబ్బులు జమ చేసిన రైతులకు కూడా ప్లాట్లు కేటాయించినప్పటికీ లాటరీ ప్రక్రియలో పాల్గొనక పోవడం చర్చనీయాంశమైంది. వారంతా నకిలీలా.. లేక ఫార్మా ప్లాట్లను ముందే అమ్ముకున్నవారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలు గ్రామాల్లో అభ్యంతరాలు, ఫిర్యాదుల నేపథ్యంలో దాదాపు 25 మంది నుంచి 50 మంది రైతులను లాటరీ ప్రక్రియలో పాల్గొనకుండా అధికారులు నిలువరించారు. మరోవైపు గతంలో భూసేకరణలో కీలకంగా పని చేసి, అక్రమాలకు పాల్పడిన ఓ మాజీ రెవెన్యూ అధికారి చివరి నిమిషంలో తనకున్న పలుకుబడితో తన అనుయాయులను లాటరీలో పాల్గొనేలా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పక్కాగా పూర్తి చేశాం



పక్కాగా లాటరీ ప్రక్రియ పూర్తి చేశాం. కొందరు రైతులను లాటరీ ప్రక్రియకు అనుమతించొద్దని ఫిర్యాదులు వచ్చాయి. అలాంటి వారిలో 25 మందికి పైగా ఉంటారు. వారిని కార్యక్రమంలో పాల్గొనకుండా చేశాం. కొందరి నకిలీల ప్లాట్లను కూడా నిలిపేశాం. లాటరీ ప్రక్రియలో పాల్గొననివారిలో అర్హులెవరైనా ఉంటే ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలో లాటరీ తీసి, రిజిస్ట్రేషన్లు చేస్తాం.

– అనంత్‌రెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం



తాండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల

పాసైనా.. డ్రాపౌట్

- పది, ఇంటర్ విద్యను మధ్యలోనే వదిలేస్తున్న విద్యార్థులు
- పదివేల మందికి అడ్మిషన్లు పొందింది 6,037 మంది మాత్రమే
- పట్టించుకోని విద్యాశాఖ, ఇంటర్ బోర్డు

తాండూరు: గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధిపై ప్రజలకు చైతన్యం కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. అందుకు ఇటీవల వచ్చిన పది, ఇంటర్ ఫలితాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సొంత జిల్లాలోనే విద్యార్థుల డ్రాపౌట్‌తో చదువుకు దూరమవుతున్నారు. పది, ఇంటర్ విద్యలో ఫెయిల్ అయిన విద్యార్థులతో పాటు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు సైతం చదువుకు దూరం అవుతుండడం ఆందోళన కలిగించే విషయం.

మరో 4వేల మంది ఎక్కడ?

జిల్లాలో 20 మండలాల్లో ఉన్న ప్రభుత్వ విద్యా సంస్థలతో పాటు ప్రైవేటు పాఠశాలలకు చెందిన 12,846 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాయగా 9,502 మంది ఉత్తీర్ణత సాధించారు. సప్లిమెంటరీ పరీక్షల్లో మరో 500 మంది పాసయ్యారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు 55 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చేరాలి. కానీ కళాశాలలు ప్రారంభమై 40 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో అడ్మిషన్లు రాలేవు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఇప్పటి వరకు 6,037 మంది విద్యార్థులు అడ్మిషన్‌లు పొందారు. అందులో జిల్లాలోని తొమ్మిది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2,627 మంది విద్యార్థులు మొదటి సంవత్సరంలో అడ్మిషన్‌లు తీసుకోగా ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో 3,410 మంది విద్యార్థులు అడ్మిషన్‌లు పొందినట్లు ఇంటర్ బోర్డు జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్ ధ్రువీకరించారు.

డ్రాపౌట్ జాబితాలో 3,410 మంది!

జిల్లాలో 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు సుమారు పదివేల మంది ఉండగా అందులో ఇప్పటి వరకు ఇంటర్ జనరల్ జాబితాలో 4,851, ఒకేషనల్ విద్యకు 1,186 మంది విద్యార్థులు చేరారు. అయితే 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన ఇంకా కళాశాలల్లో అడ్మిషన్‌లు పొందని విద్యార్థులు 3,410 వరకు ఉన్నట్లు అంచనా. వీరిలో 900–1,200 మంది వరకు ఐఐటీ, నీట్ కోర్సుల కోసం వెళ్లే అవకాశం ఉంది. కాని మిగతా విద్యార్థులు కాలేజీ విద్యకు దూరమయ్యారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

డిగ్రీలకు దూరం

జిల్లాలో 16,439 మంది విద్యార్థులు ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర పరీక్షలకు హాజరవగా 50 శాతంలోపే ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు డిగ్రీలో అడ్మిషన్‌లు పొందటం లేదంటూ విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా వికారాబాద్ జిల్లాలో 17 డిగ్రీ కళాశాలల్లో 2,500 మంది నుంచి 3వేల లోపే విద్యార్థులు అడ్మిషన్‌లు స్వీకరిస్తున్నారు.

ఉన్నత విద్యలో చివరి స్థానం

జిల్లాలో ఉన్నత విద్యను అభ్యసించడంలో జిల్లా పూర్తిగా వెనుకబడింది. ప్రతి ఏటా వేల సంఖ్యలో విద్యార్థులు పది, ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధిస్తున్నా ఉన్నత చదువుల్లో వెనుకబడుతున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాలతో చాలా మంది చదువులకు దూరం అవుతున్నారు. మరోవైపు బాలికలు పెళ్లీడుకు వచ్చారంటూ తల్లిదండ్రులు వివాహం చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరాలని ప్రచారం చేస్తున్నాం. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని కళాశాల అధ్యాపకులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు కళాశాలలో ఎందుకు అడ్మిషన్‌లు తీసుకోలేదనే దానిపై వివరాలు సేకరిస్తాం.

– శంకర్‌నాయక్, ఇంటర్ బోర్డు జిల్లా నోడల్ అధికారి

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న, శివసేనారెడ్డి, కాలె యాదయ్య తదితరులు

షాబాద్: క్రీడలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో 15 రోజులుగా ఎస్‌పీఎస్–3 క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, మల్లికార్జున ముత్య (అప్పాజీ) చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మొదటి స్థానంలో నిలిచిన కేకేఆర్ జట్టుకు రూ.లక్ష నగదు, కప్ అందజేశారు. రెండో బహుమతి గెలుచుకున్న ఢిల్లీ జట్టుకు రూ.50 వేల నగదు, కప్ మూడో స్థానంలో నిలిచిన సీఎస్‌కే జట్టుకు రూ.25వేల నగదు, కప్‌ను అందజేశారు. నాలుగో బహుమతి గెలుచుకున్న ఎస్‌ఎస్‌జీ జట్టుకు రూ.15వేల నగదు, కప్‌ను అందించారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి క్రీడాభివృద్ధికి రూ.850 కోట్లు కేటాయించారని తెలిపారు. మినీ స్టేడియాల నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ మాజీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల పంపిణీ



కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటుడు అలీ తదితరులు

కేశంపేట: మండల పరిధిలోని వేములనర్వ శివారులో ఆర్ట్ డైరెక్టర్ విభాగంలో పనిచేసే వారికి ఇంటి స్థలాల పంపిణీ కార్యక్రమాన్ని ఆర్ట్ డైరెక్టర్ అధ్యక్షుడు రమణవంక అధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సినీ నటుడు అలీ 172 మందికి 200 గజాల చొప్పున ఇంటి స్థలాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్ల సభ్యుల అభ్యున్నతికి తోడ్పడటం అభినందనీయమని పేర్కొన్నారు. తెలుగు సినీ ఆర్ట్ డైరెక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2017లో సర్వే నంబర్లు 570, 571లో 11.07 ఎకరాల వ్యవసాయభూమిని కొనుగోలు చేసింది. ఈ భూమిలో గతంలోనే ప్లాట్లు చేసినప్పటికీ ఎల్ఆర్ఎస్ పూర్తి కాకపోవడంతో పంపిణీ ప్రక్రియ నిర్వహించలేదు. ప్రభుత్వం నాన్‌లేఅవుట్ ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ అవకాశం కల్పించడంతో అసోసియేషన్ సద్వినియోగం చేసుకుంది. కార్యక్రమంలో తెలుగు సినీ ఆర్ట్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర ప్రసాద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల, మల్లేష్ యాదవ్, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు రొల్ల రఘు రాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు మంత్రి కొండా సురేఖ పర్యటన

పరిగి: పట్టణంలోని ఎస్సీ కాలనీలో నిర్మించిన సీతారామాలయం, బహార్‌పేట్ బీసీకాలనీలో పోచమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవానికి సోమవారం ఉదయం 11 గంటలకు అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విచ్చేయనున్నట్లు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతరం 11.30గంటలకు పట్టణ కేంద్రంలోని శ్రీనివాస్ కాలనీలో వనమహోత్సవం, మధ్యాహ్నం 1.30గంటలకు కుల్కచర్ల మండలం బండవెల్కిచర్లలోని పాంబండ రామలింగేశ్వర స్వామి దర్శనం, వన మహోత్సవంలో పాల్గొని అక్కడే నిర్వహించనున్న బహిరంగ సభలో ప్రసంగిస్తారని చెప్పారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మహాసభను విజయవంతం చేయాలి

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింలు

అనంతగిరి: ఆసరా పెన్షన్ల పెంపునకు వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టబోయే మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విచ్చేస్తున్నారని చెప్పారు. జిల్లాలోని ఆసరా పెన్షన్‌దారులు వేలాది తరలివచ్చి సమస్యపై ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

కేజీబీవీలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు రూరల్: మండల పరిధిలోని ఐనెల్లి గేటు వద్ద ఉన్న కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ కోర్సులో సీట్లు ఖాళీగా ఉన్నాయని ప్రత్యేకాధికారిణి ఆశలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులైన బాలికలు అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. హాస్టల్ వసతి ఉన్నట్లు చెప్పారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి విడుదల చేయాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్

బంట్వారం: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

మాయావతిని కలిసిన బీఎస్పీ నేతలు



బీఎస్పీ అధినేత మాయావతితో చంద్రశేఖర్ ముదిరాజ్ తదితరులు

తాండూరు టౌన్: బీఎస్పీ అధినేత కుమారి మాయావతిని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని చంద్రశేఖర్ ముదిరాజ్ ఆదివారం లక్నోలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాయావతి మాట్లాడుతూ.. రాజ్యాధికారం కొందరి చేతుల్లోనే వుందని బలహీన వర్గాలను మరింత బలహీనం చేస్తూ దేశాన్ని దోచుకుంటన్న విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారని చెప్పారు. తెలంగాణలో బహుజన రాజ్యాధికారం కోసం శక్తి వంచన లేకుండా పనిచేయాలన్నారని తెలిపారు. చంద్రశేఖర్ వెంట పార్టీ సెంట్రల్ స్టేట్ కోఆర్డినేటర్ దయానంద్‌రావు, రాంచందర్ రావు తదితరులున్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

ఆమనగల్లు: ధ్యానం చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడంతో పాటు ఆరోగ్యాన్ని పొందొచ్చని అంతర్జాతీయ మానవహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు మహేందర్ అన్నారు. పట్టణంలోని గ్రంథాలయ ఆవరణలో ఆదివారం ఉచిత ధ్యాన శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంపూర్ణ ఆరోగ్యానికి ధ్యానం ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. వారానికి మూడు రోజుల పాటు ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ధ్యాన గురువులు, ధ్యానులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మూడు ట్రాక్టర్లు సీజ్


పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఎర్ర మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రమేశ్ తెలిపిన ప్రకారం.. శనివారం రాత్రి ఎలాంటి అనుమతులు లేకుండా ఎర్ర మట్టిని తరలిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. పోలీసులు అక్కడి చేరుకుని వాహనాలు నిలిపి తనిఖీలు చేపట్టగా ఎలాంటి అనుమతులు లేకపోవడంతో కాటనిపలి అంజిలయ్య, ఈడిగళ్ల బాబు, శివని ఎల్లయ్యకు చెందిన మూడు ట్రాక్టర్లు సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి


గేదె కళేబరం వద్ద రైతు

అనంతగిరి: విద్యుదాఘాతంతో ఓ గేదె మృత్యువాత పడింది. వివరాలు.. మున్సిపల్ పరిధిలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన నర్సింలు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి ఇంటికి వస్తున్న క్రమంలో చిన్న నీటి గుంట వద్ద గేదె నీరు తాగేందుకు వెళ్లింది. అక్కడే పడిపోయిన విద్యుత్ వైర్ గేదెకు తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

సిరిపురం హాస్టల్‌లో పురుగుల భోజనం

ఆందోళనకు దిగిన విద్యార్థులు, తల్లిదండ్రులు


విద్యార్థులు పడేసిన మధ్యాహ్న భోజనం

మర్పల్లి: మండల పరిధిలోని సిరిపురం ఎస్సీ హాస్టల్లో ఆదివారం వసతి గృహం సిబ్బంది పురుగుల అన్నం వడ్డించారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం, వార్డెన్ పట్టించుకోక పోవడంతోనే తరచూ పురుగులు వస్తున్నాయని దీంతో తాము తప్పక తినాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మెనూ పాటించడం లేదని ఆరోపించారు. విషయం తెలుసుకున్న వార్డెన్ తుల్జారామ్ బియ్యాన్ని శుభ్రం చేయించిన తర్వాత వంట చేపించి వడ్డించారు.

వ్యక్తి దారుణ హత్య

కొట్టి చంపిన భార్యాభర్తలు

మేడ్చల్‌రూరల్: భార్యాభర్తలు ఓ వ్యక్తిని కొట్టి చంపిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ చెందిన ఎదునూరి నరసింహ అలియాస్ చిన్న, తన భార్య అనితతో కలిసి మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని చెక్‌పోస్ట్‌లో ఉంటూ రోడ్డు పక్కన కాగితాలు, ప్లాస్టిక్ వస్తువులను సేకరించి, అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. మెదక్ జిల్లా, తిమ్మాపూర్ గ్రామానికి చెందిన నర్సింలు (37) శనివారం మధ్యాహ్నం మేడ్చల్ చెక్ పోస్ట్‌లోని వెంకటరమణ లిక్కర్ ల్యాండ్ వద్ద మద్యం తాగుతుండగా చిన్న, అతడి భార్య అనితతో స్క్రాప్ విషయమై గొడవ జరిగింది. దీంతో వారిద్దరూ కలిసి నర్సింహులును కర్రలతో కొట్టడంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి దీనిని గుర్తించిన వైన్ షాప్ నిర్వాహకుడు మహేష్ మేడ్చల్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బోనమెత్తిన పల్లెలు

ఆషాఢమాసం సందర్భంగా గ్రామాల్లో బోనాల సందడి నెలకొంది. ఆదివారం దౌల్తాబాద్ మండల పరిధిలోని కింది మోసటి, మీది మోసటి కాలనీల్లో పోచమ్మ తల్లికి, ధారూరు మండల పరిధిలోని నాగసముందర్‌లో మైసమ్మ తల్లికి, పరిగి పట్టణ కేంద్రంలో మైసమ్మ, పోచమ్మ తల్లులకు బోనమెత్తారు. ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసిన మహిళలు అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు. – దౌల్తాబాద్, ధారూరు, పరిగి


దౌల్తాబాద్: పోచమ్మ బోనాలు


ధారూరు: నాగసముందర్‌లో మైసమ్మ బోనాలు


పరిగి: ఉత్సవాల్లో నాయకులు

భళా.. చేనేత హస్తకళ

పలు రాష్ట్రాల సంప్రదాయ దుస్తుల విక్రయం

తాండూరు టౌన్: పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో చేనేత హస్త కళ ప్రదర్శన విక్రయాలు ప్రారంభమయ్యాయి. దేశంలోని పది రాష్ట్రాలకు పైగా అక్కడి సంప్రదాయ చేనేత కళలకు సంబంధించిన దుస్తులు, పలు రకాల వస్తువుల విక్రయానికి ఉంచారు. కాటన్ షర్ట్స్, కుర్తీ, హ్యాండ్ బ్యాగ్స్, స్టోన్ జువెల్లరీ, చీరలు, కొయ్య బొమ్మలు, బెడ్ షీట్స్, టవల్స్, బొమ్మలు తదితర చేతివృత్తి ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. వచ్చే నెల 3వ తేదీ వరకు ప్రదర్శన, విక్రయాలు కొనసాగుతాయని నిర్వాహకులు చెబుతున్నారు.


చీరలు కొనుగోలు చేస్తున్న మహిళలు

రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం

చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం


రిలే దీక్షలో పాల్గొన్న కేఎస్ రత్నం తదితరులు

మొయినాబాద్: ఎనికేపల్లి రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. గోశాల ఏర్పాటుకు ప్రతిపాదించిన ఎనికేపల్లి భూముల వద్ద రైతులతో కలిసి ఆదివారం ఏడో రోజు రిలే దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల పొట్టగొట్టి గోశాల ఏర్పాటు చేయాలని చూస్తోందని విమర్శించారు. ఎనభై ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములను ఎలా వదులుకుంటారని ప్రశ్నించారు. గోశాల పేరుతో ప్రభుత్వం భూ దందా చేస్తోందని ఆరోపించారు. దీక్ష చేపడుతున్న రైతులు, మాజీ ఎమ్మెల్యే రత్నంకు శంకర్‌పల్లి మండల బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు సుధీంద్ర, నీలకంఠం, లక్ష్మీపతియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైన్‌షాప్‌లో చోరీ

షాబాద్: గుర్తు తెలియని వ్యక్తులు వైన్ షాప్‌లో చోరీకి పాల్పడ్డారు. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్‌లోని లక్ష్మీనర్సింహ వైన్స్‌లో అమ్మకాలు కొనసాగించిన నిర్వాహకుడు మహేందర్ శనివారం రాత్రి 10 గంటల తర్వాత దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం వైన్స్ పక్కనే ఉండే రాజ్‌కుమార్ దుకాణం వెనుక వైపు గోడకు పెద్ద రంధ్రం పడి ఉండడాన్ని గమనించి వైన్స్ యజమానికి ఫోన్ చేసి చెప్పాడు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రూ.15వేల నగదు, 12 విస్కీ బాటిళ్లు దొంగిలించి, మరో 20 బాటిళ్లను ధ్వంసం చేసినట్లు గుర్తించారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. వైన్స్ యజమాని మామిడి విజయపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


వైన్స్ వెనుక భాగంలో గోడకు చేసిన రంధ్రం

కొనసాగుతున్న భగవద్గీత పారాయణం


గీతాపారాయణంలో పాల్గొన్న మహిళలు

అనంతగిరి: గీతావాహిణి ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలో ఈనెల 9వ తేదీన ప్రారంభమైన భగవద్గీత పారాయణం నిరంతరాయంగా కొనసాగుతోంది. ఆదివారం పట్టణంలోని గౌతమి జూనియర్ కళాశాలలో సామూహిక పారాయణం చేపట్టారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు పారాయణం కొనసాగింది. ఈ నెల 17వరకు పారాయణం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గొర్రె కాపరుల సమస్యలు పరిష్కరించాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఖిల్లా గోపాల్

ఆమనగల్లు: రాష్ట్రంలో గొర్రెలు, మేకల పెంపకం దారుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు ఖిల్లా గోపాల్ డిమాండ్ చేశారు. 50 ఏళ్లు నిండిన గొర్రెలు, మేకలు పెంపకందారులకు రూ.5 వేలు పింఛన్ అందించాలని అన్నారు. తలకొండపల్లిలో ఆదివారం గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గొర్రెలు, మేకల పెంపకంపై ఆధారపడి లక్షలాది కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. వ్యవసాయ భూములు చిన్న కమతాలుగా ఏర్పడటంతో గొర్రెలు, మేకలకు మేత, నీరు లభించడం లేదని.. దీంతో గొర్రెలు, మేకలతో పెంపకందారులు వలస బాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ కారణాలతో మరణిస్తున్న గొర్రెల కాపరులకు బీమా అందించడం లేదన్నారు. గొర్రెల సహకార సంఘాలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించకుండా నిర్వీర్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 50 శాతం సబ్సిడీతో గొల్ల, కురుమలకు గొర్రెల ఫాం ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు.


మహాసభలో మాట్లాడుతున్న గోపాల్

తెలంగాణలో బీజేపీ బలంగా ఉంది


స్థానిక నాయకులతో సోము వీర్రాజు

ఎమ్మెల్సీ సోము వీర్రాజు

ఆమనగల్లు: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని పార్టీ కార్యాలయానికి ఆదివారం విచ్చేసిన ఆయనకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం సోము వీర్రాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ బలంగా ఉందని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కండె హరిప్రసాద్, మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు లక్ష్మణ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కల్వకుర్తి బీజేపీ కో కన్వీనర్ నర్సింహ, బీజేవైఎం కో కన్వీనర్ రవిరాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

రూపుమార్చ బడి

- అనాథ పిల్లలకు హైటెక్ చదువులు
- అందాల భామల ఆర్థిక సహాయం
- కొత్త హంగులతో వీఎం హోం
- కంప్యూటర్లు, డిజిటల్ బోర్డులతో బోధన
- ఆసక్తిగా నేర్చుకుంటున్న విద్యార్థులు


డిజిటల్ క్లాస్ రూమ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

హుడాకాంప్లెక్స్: అనాథల ఆశ్రమ పాఠశాల (విక్టోరియా మెమోరియల్ హోమ్స్) హైటెక్ హంగులు సంతరించుకుంది. సంప్రదాయ బోధన, అధ్యయనానికి భిన్నంగా తరగతి గదుల్లో అత్యాధునిక కంప్యూటర్లు, డిజిటల్ బోర్డులు వచ్చి చేరాయి. ఇటీవల హైదరాబాద్ వేదికగా నిర్వహించిన మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన అందాల భామలు అందించిన చేయూతతో అనాథలకు హైటెక్ చదువులు చేరువయ్యాయి.

డిజిటల్ క్లాసురూములు

చారిత్రక సరూర్‌నగర్ విక్టోరియా మెమోరియల్ హోమ్‌లో తొమ్మిది వందల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. తల్లిదండ్రులు లేనివారితో పాటు సింగిల్ పేరెంట్ పిల్లలు కూడా ఇక్కడ ఉంటున్నారు. ఇప్పటివరకు వీరికి సంప్రదాయ పద్ధతుల్లోనే విద్యాబోధన కొనసాగింది. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉండేది కాదు. అనాథ పిల్లలకు తమవంతు సాయం అందించాలనే ఉద్దేశంతో మిస్ వరల్డ్ పోటీల నిర్వాహకులు.. 40 కంప్యూటర్లు, ఫర్నిచర్, డిజిటల్ ప్రొజెక్టర్లు, 75 ఇంచుల టీవీలు సహా పలు విద్యుత్ పరికరాలను అందజేశారు. సాధారణ బోర్డుల స్థానంలో డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేశారు. అర్థం కాని అంశాలపై ఆన్‌లైన్‌లో రికార్డు చేసి ఉంచిన పాఠాలను ప్రొజెక్టర్లపై వేసి వివరిస్తున్నారు. వీటిని పిల్లలు సులభంగా అర్థం చేసుకుంటున్నారు.

బేసిక్స్ నేర్చుకుంటున్నాం



ఇంటర్, డిగ్రీ స్థాయిలో నేర్చుకునే అంశాలను కంప్యూటర్ల ద్వారా ఇప్పుడే నేర్చుకునే అవకాశం కలిగింది. అర్థం కాని అనేక అంశాలు.. దీని ద్వారా సులభంగా అవగతం చేసుకోగలుగుతున్నాం. పైసా ఖర్చు లేకుండానే కంప్యూటర్ విద్యను నేర్చుకుంటున్నాం. చాలా ఆనందంగా ఉంది.

– అక్షిత, 8వ తరగతి

రోజుకు గంట చొప్పున..



అనాథలు హోమ్ నుంచి బయటకు వెళ్లిన తర్వాత సొంత కాళ్లపై నిలబడేందుకు కంప్యూటర్ కోర్సులు దోహదం చేస్తాయి. సాధారణ పాఠ్యాంశాలతో పాటు టైపింగ్, వర్డ్, ఎంఎస్ ఆఫీస్, గ్రాఫిక్స్ డిజైన్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నాం. ప్రస్తుతం ఐదు నుంచి పదో తరగతి వరకు కంప్యూటర్లపై రోజుకు గంట పాటు పాఠాలు బోధిస్తున్నాం.

– శివప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్

ఎంతో ఉపయుక్తం



ఖాళీ సమయంలో కంప్యూటర్‌లోనే స్పోకెన్ ఇంగ్లిష్ క్లాసులు వింటున్నాం. సైన్స్, సోషల్‌కు సంబంధించిన అనేక అంశాలను వీడియోల ద్వారా అర్థం చేసుకోగలుగుతున్నాం. కంప్యూటర్లు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయి. – తేజస్విని, 8వ తరగతి

సులభంగా అర్థమవుతోంది



టీచర్ చెప్పిన అంశం గతంలో సరిగ్గా అర్థం అయ్యేది కాదు. డిజిటల్ క్లాసురూమ్‌తో ప్రస్తుతం సులభంగా అర్థం చేసుకోగలుగుతున్నాం. – చరితసాయి, 8వ తరగతి

ఫిజిక్స్‌లో డాక్టరేట్


పానుగంటి రాణి

షాద్‌నగర్: ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి షాద్‌నగర్ పట్టణంలోని శ్రీనివాస కాలనీకి చెందిన పానుగంటి రాణి డాక్టరేట్ అందుకున్నారు. పానుగంటి రాణి విశ్వవిద్యాలయంలోని డిపార్టుమెంట్ ఆఫ్ ఫిజిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నథానియేల్ పర్యవేక్షణలో ఇన్వెస్టిగేషన్ ఆఫ్ స్ట్రక్చరల్ ఎలక్ట్రికల్ అండ్ మాగ్నెటిక్ ప్రాపర్టీస్ ఆఫ్ రేర్ ఎర్త్ అంశంపై పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఓయూలో నిర్వహించిన కార్యక్రమంలో ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ ఎం.ప్రసాద్ చేతుల మీదుగా ఆమె డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం ఆమె కేశంపేట మండలం కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తిస్తున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

రూ.4 లక్షల 54వేలు స్వాధీనం

మీర్‌పేట: పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని మీర్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. బడంగ్‌పేట ఆర్ఎంఆర్ కాలనీలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఎల్‌బీనగర్ ఎస్ఓటీ బృందంతో కలిసి దాడి చేశారు. 8 మందిని అరెస్ట్ చేసి.. వారి వద్ద నుంచి రూ.4 లక్షల 54వేలు, 8 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశామని సీఐ తెలిపారు.

రైలు కిందపడి వృద్ధుడి మృతి

శంకర్‌పల్లి: గుర్తు తెలియని వృద్ధుడు రైలు కింద పడి మృతి చెందిన సంఘటన మండలంలోని కొండకల్ గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. వికారాబాద్ రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. ఓ గుర్తు తెలియని వృద్ధుడు(60) ఆదివారం ఉదయం 11 గంటలకు కొండకల్ సమీపంలో రైలు కింద పడి మృతి చెందాడు. స్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారం మేరకు వికారాబాద్ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మార్చురీలో భద్రపరిచారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జ్ఞానేశ్వర్ ఉద్యోగులకు స్ఫూర్తి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు

కుల్కచర్ల: మనసున్న అధికారులను ప్రజలు ఎప్పటికీ గుర్తించుకుంటారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు అన్నారు. గతంలో కుల్కచర్ల పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి మీర్‌పేట్ మున్సిపల్ కమిషనర్‌గా పదవీవిరమణ పొందిన రెడ్డిపల్లి జ్ఞానేశ్వర్‌కు ఆదివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రహ్లాదరావు మాట్లాడుతూ.. విధుల్లో అందరిచేత ప్రశంసలు పొందిన జ్ఞానేశ్వర్ ఉద్యోగులందరికీ ఆదర్శనీయమన్నారు. పదవీకాలం పూర్తయినా కొంత మంది ఉద్యోగులను ప్రజల మదిలో చిరకాలం గుర్తుండి పోతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సురేశ్, మంతయ్య, సంగప్ప, ప్రకాశ్, వీరేశం, ప్రసన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రహ్లాదరావు

లైన్‌మెన్‌కు బెదిరింపులు

- విద్యుత్ సరఫరా విషయంలో నోరుపారేసుకున్న పంచాయతీ కార్యదర్శి
- సోషల్‌మీడియాలో ఆడియోలు వైరల్
- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

దోమ: విద్యుత్ సరఫరా విషయంలో ఓ లైన్‌మెన్‌పై పంచాయతీ కార్యదర్శి నోరుపారేసుకున్న ఆడియో ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ ఘటన మండల పరిధిలోని ఐనాపూర్‌లో చోటుచేసుకుంది. విద్యుత్ లైన్‌మెన్ తెలిపిన ప్రకారం.. ఐనాపూర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండడంతో ఈడిగి భాస్కర్ గౌడ్(పంచాయతీ కార్యదర్శి, కుల్కచర్ల) లైన్‌మెన్‌కు ఫోన్ చేశారు. శనివారం సాయంత్రం దిర్సంపల్లిలో ఈదురు గాలులు రావడంతో గ్రామానికి చెందిన రాయికంటి అనంతయ్య ఇంటి వద్ద విద్యుత్ స్తంభంపై వైర్లు ఒకదానికి ఒకటి అంటుకోవడంతో మంటలు చేలరేగి విద్యుత్ అంతరాయం ఏర్పడిందని వివరించాడు. దీంతో ఉగిపోయిన పంచాయతీ కార్యదర్శి ఫోన్ కాల్‌లో లైన్‌మెన్‌తో బూతులు తిడుతూ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో రమేశ్ సహచర లైన్‌మెన్‌లతో కలిసి ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అ'పూర్వ'సమ్మేళనం

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ జెడ్పీహెచ్ఎస్ 2001–2002 బ్యాచ్ విద్యార్థులు 23 ఏళ్ల తరువాత కలుసుకున్నారు. ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఏర్పాటు చేసుకుని వారి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించుకున్నారు.



హస్నాబాద్ జెడ్పీహెచ్ఎస్ 2001-02 బ్యాచ్ విద్యార్థులు